క్లుప్తంగా

ఆధార్ కేంద్రం పరిశీలన



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ గిరిబాల

నెల్లిమర్ల: పట్టణంలోని సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీఓ జి.గిరిబాల సోమవారం పరిశీలించారు. విద్యార్థులందరికీ ఆధార్ నమోదు, సవరణ సేవలను అందించాలన్నారు. భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా మార్పులను చేసుకోవాలని విద్యార్థులకు ఎంపీడీఓ సూచించారు. మండలంలోని అన్ని జూనియర్ కళాశాల ల్లోనూ ఈ విధంగా ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎంపీడీఓ వెంట ఈఓపీఆర్డీ భానోజీరావు ఉన్నారు.

పేదలకు చేయూత



పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న గణపతిరావు

విజయనగరం ఫోర్ట్: పేదలకు చేయూత ఇవ్వడంలో సంతృప్తి ఉందని వ్యాపార వేత్త నాగమల్లి గణపతిరావు పేర్కొన్నారు. స్థానిక కణపాక అగురవీధిలో మారుతీ స్వయం సహాయక సంఘం ఆధ్వర్యంలో 100 మందికి బియ్యం, గోధుమనూక మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు పట్టెడు అన్నం పెట్టడం కోసం మారుతీ స్వయం సహాయక సంఘం చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోవాలన్నారు. వారి పట్ల చిరుకు, విసుక్కోవడం చేయకూడదన్నారు. కార్యక్రమంలో మారుతీ స్వయం సహాయక సంఘం అధ్యక్షుడు గుత్తురు చంద్రశేఖర్, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉపాధి పనులు



సతివాడ చెరువులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ గిరిబాల

నెల్లిమర్ల రూరల్: ఉపాధి హామీ పనులు పారదర్శకంగా జరిగేలా క్షేత్ర సహాయకులు నిత్యం పర్యవేక్షించాలని ఎంపీడీఓ గిరిబాల సూచించారు. మండలంలోని సతివాడ ఈగలవాని చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. పనుల్లో అక్రమాలు జరగకుండా చూసుకోవాలన్నారు. క్షేత్ర సహాయకులు జాబ్ కార్డులను పరిశీలించి, కొలతలు సక్రమంగా కొలవాలని సూచించారు. అవకతవకలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది, వేతనదారులు పాల్గొన్నారు.

ఇంటింటికీ కుళాయి పనులకు శంకుస్థాపన



ఇంటింటికీ కుళాయి పనులకు శంకుస్థాపన చేస్తున్న సూర్యనారాయణరెడ్డి

భోగాపురం: మండలంలోని ముక్కాం పంచాయతీ కొంగవానిపాలెం, రామచంద్రపేట పంచాయతీ తోటపల్లి గ్రామాల్లో ఇంటింటికీ కుళాయి పనులకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. వాటర్ ఎయిడ్ ప్రైవేటు సంస్థ సమకూర్చిన సుమారు రూ.21 లక్షల వ్యయంతో ఈ పనులు చేపట్టనున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వాసుపల్లి రేయుడు, దుక్క అప్పన్న, మైలపల్లి అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల ఆందోళన



బీఎస్ఎన్ఎల్ కార్యాలయ ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న జేఏసీ నాయకులు

విజయనగరం టౌన్: బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్యాలయ ఆవరణలో జేఏసీ నాన్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో ఉద్యోగులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఆలుగు వెంకటరావు, ఎన్ఎఫ్‌టీఈ జిల్లా కార్యదర్శి అప్పారావు మాట్లాడుతూ 2017 జనవరి 1వ తేదీ నుంచి మూడో వేతన సవరణ చేయాలని, ఉద్యోగులకు నూతన ప్రమోషన్ పాలసీని ఇంప్లిమెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా బీఎస్ఎన్ఎల్‌కి 4జీ, 5 జీ సర్వీసులు వెంటనే కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్‌టీఈ అధ్యక్షుడు భాస్కరరావు, అప్పారావు, రవిరాజ్, తామాడ కృష్ణకుమారి, శకుంతల, పద్మ, రమణమ్మ, జగన్ తదితరులు పాల్గొన్నారు.

పాలనలో తేడాను ప్రజలకు వివరించండి

- మూడేళ్లలో ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలు చేసిన ఘనత జగన్‌దే
- హామీల అమల్లో చంద్రబాబు విఫలం
- 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసేది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే..
- ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: 2019 ఎన్నికలకు ముందు జరిగిన పాలనకు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వ పాలనలో తేడాను ప్రజలకు వివరించి, 2024 ఎన్నికల్లో మరల ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కూర్చుండబెట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. నగరంలోని సుజాత కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు చేపట్టాల్సిన బాధ్యతలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోలగట్ల వీరభద్రస్వామి వారు చేయాల్సిన బాధ్యతలపై క్షుణ్ణంగా వివరించారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహించాలని దిశా నిర్దేశం చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి పార్టీ ఆదేశాల మేరకు సర్వే ప్రక్రియను 100 శాతం పూర్తి చేయాలన్నారు. ఈ ప్రక్రియలో సదరు ఇంటి యజమాని అభిప్రాయాన్ని ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు నిర్వహించిన పాదయాత్రలో ఇచ్చిన హామీలను మూడేళ్లలోనే 98 శాతం అమలు చేసి రికార్డు సృష్టించారని పేర్కొన్నారు. 2014 ఎన్నికలకు ముందు చంద్రబాబు చేసిన 600పైగా హామీల అమల్లో ప్రజలను నమ్మించి మోసం చేయటంతోనే ప్రజా తిరస్కరణకు గురయ్యారని ఉదాహరణలతో వివరించారు. ప్రజా సంక్షేమ పాలనను క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించడంలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.



హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు తీరుపై ప్రజల్లో అసంతృప్తి

మాజీ కేంద్ర మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు తీరు విజయనగరం ప్రజలు తలదించుకునేలా ఉందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఎద్దేవా చేశారు. తాను కేంద్రమంత్రిగా ఉన్న హయాంలో విజయనగరం జిల్లా ప్రజల చిరకాల వాంఛ ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటును వ్యతిరేకించి... ఇటీవల ఓ రాజకీయ పార్టీ ఆధ్వర్యంలో జిల్లాలో క్యాన్సర్ ఆస్పత్రి ఏర్పాటు చేయాలంటూ చేసిన నిరసన దీక్షలో పాల్గొని మద్దతు తెలపటం పట్ల ప్రజలు నవ్వుకుంటున్నారని చెప్పారు. నియోజకవర్గంలో తాము చేస్తున్న అభివృద్ధి నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మితో పాటు కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ.రాజేష్, నగర పార్టీ అధ్యక్షుడు ఆశపు వేణు తదితరులు మాట్లాడగా.... వివిధ డివిజన్‌ల కార్పొరేటర్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విజయానికి సారథులై పని చేయాలి

- ఎమ్మెల్యే బడ్డుకొండ, పరిశీలకుడు అంధవరపు

డెంకాడ: గృహసారథులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరిస్తూ, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి సారథులై పని చేయాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, నెల్లిమర్ల నియోజకవర్గ పరిశీలకుడు అంధవరపు సూరిబాబు అన్నారు. మండలంలోని పెదతాడివాడ వద్ద ఉన్న పీబీఆర్ కల్యాణ మండపంలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే అప్పలనాయుడు, నియోజకవర్గ పరిశీలకుడు సూరిబాబు మాట్లాడూతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, ఇతర ప్రభుత్వ సేవలు అందించడంలో వలంటీర్లు కీలకంగా పని చేస్తున్నారని వారి భద్రత సీఎం జగన్ చూసుకుంటారని తెలిపారు. గ్రామాల్లో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని అందించారన్నారు. ఒక్క డెంకాడ మండలానికి సంక్షేమ పథకాల ద్వారా రూ.412 కోట్లు ప్రభుత్వం అందించిందని వివరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నమ్మకానికి బ్రాండ్ అంబాసిడర్ అన్నారు. అదే చంద్రబాబు అబద్దాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రామతీర్థ సాగర్ రిజర్వాయర్ మంజూరు చేస్తే.. ఆయన కుమారుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనులను పూర్తి చేసే దిశగా పని చేస్తున్నారని వివరించారు. పవన్‌కల్యాణ్ స్వంత ఎజెండాతో కాకుండా చంద్రబాబు ఎజెండాను మోసుకుని ప్రజల వద్దకు వస్తున్నారని, దీనికి ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పలువురు గృహసారథులకు ప్రచార కిట్లను అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, డెంకాడ, పోలిపల్లి సొసైటీల అధ్యక్షులు రొంగలి కనక సింహాచలం, బాలి సత్యనారాయణ,పలు విభాగాల డైరెక్టర్లు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



గృహసారథులకు కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, నియోజకవర్గ పరిశీలకుడు సూరిబాబు

రహదారి భద్రతపై అవగాహన అవసరం

- ఆర్‌టీఓ ఆదినారాయణరావు



రోడ్డు భద్రత ప్లకార్డులు ప్రదర్శిస్తున్న, ఆర్‌టీఓ ఆదినారాయణ, తదితరులు

విజయనగరం క్రైమ్: విద్యార్థి దశ నుంచే రోడ్ సేఫ్టీపై అవగాహన కలిగి ఉండాలని రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ జి.ఆదినారాయణరావు పేర్కొన్నారు. ఉడా కాలనీలో ఉన్న నేషనల్ స్కూల్ ఆవరణలో రోడ్ సేఫ్టీపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపైకి బైక్‌తో వచ్చినప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించే విధంగా తల్లిదండ్రులకు విద్యార్థులే చెప్పాలన్నారు. రోడ్ సేఫ్టీ ఎన్‌జీఓ రీజనల్ అధ్యక్షుడు మజ్జి అప్పారావు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా యువత చనిపోతున్నారన్నారు. హెల్మెట్ ధరించడం వలన ప్రమాదాల నుంచి తప్పించుకోవచ్చన్నారు. అదే విధంగా రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి సహాయం చేయాలన్నారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ బి.నారాయణరావు, ఎన్‌జీఓ కమిటీ డాక్టర్ జి.సాయికుమార్ , ఎస్.హరిబాబు, జి.రాంబాబు, శ్రీరామూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఫీ'జులుం'పై చర్యలకు డిమాండ్

విజయనగరం: ప్రాక్టికల్ పరీక్షల పేరిట విద్యార్థుల నుంచి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఇంటర్మీడియట్ రీజనల్ అధికారి సత్యనారాయణకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకుడు రాజానరమణ మాట్లాడుతూ అధిక ఫీజుల వసూళ్లతో విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రెగ్యులేటర్ చట్టం తెచ్చినప్పటికీ కొన్ని కళాశాలలు పట్టించుకోవడంలేదని, అలాంటి కళాశాలల రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ వంశీకుమార్, అరుణ్, కృష్ణ పాల్గొన్నారు.

మూడిళ్లు దగ్ధం

పూసపాటిరేగ: మండలంలోని కనిమెట్టలో మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో మూడిళ్లు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన గడదేశి రాము, గడదేశి అప్పలస్వామి, గడదేశి అప్పన్నల పూరిళ్లు అగ్నిప్రమాదంలో కాలిపోవడంతో పాటు ఇంట్లోని గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపులోకి తీసుకువచ్చారు.

ప్రారంభమైన రాగం తానం పల్లవి వర్క్‌షాప్

విజయనగరం టౌన్: స్థానిక మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ఆవరణలో మంగళవారం సాయంత్ర రాగం తానం పల్లవి వర్క్‌షాప్ నిర్వహించారు. సంగీత సేవామణి ప్రొఫెసర్ ద్వారం విజె.లక్ష్మి వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులకు పలు కీర్తనలు పాడే విధానంతో పాటూ మెలకువలు నేర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆర్‌వి.ప్రసన్నకుమారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి కొప్పెర్ల పార్వతమ్మ జాతర



పూసపాటిరేగ: ఉత్తరాంధ్ర ఇలవేల్పు కొప్పెర్ల పార్వతమ్మ జాతర ఈ నెల 8, 9, 10 తేదీలలో జరగనున్నట్టు ఆలయ ధర్మకర్తలు ఇనకోటి వంశీయులు తెలిపారు. మూడు రోజుల పాటు జరగనున్న జాతరకు ఆలయ కమిటీ భారీగా ఏర్పాట్లు చేశారు. వేల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో మొక్కులు చెల్లించడానికి క్యూలైన్లు ఏర్పాటు చేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణకు, జాతర సజావుగా సాగేందుకు ఆలయ కమిటీ సభ్యులతో పోలీస్ శాఖ సమావేశమై ఏర్పాట్లుపై సమీక్షించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూసపాటిరేగ ఎస్ఐ ఎ.నరేష్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

సఖి కార్యక్రమంపై అవగాహన కల్పించాలి

- జెడ్పీ సీఈఓ అశోక్‌కుమార్

విజయనగరం రూరల్: సఖి కార్యక్రమంపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని జెడ్పీ సీఈఓ అశోక్‌కుమార్ తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో సఖి కార్యక్రమంపై మండల శాఖ అధికారులకు మంగళవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన జెడ్పీ సీఈఓ అరుణ్ కుమార్ మాట్లాడుతూ ప్రతీ నెల మండల స్థాయిలో ఈ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామ స్థాయిలో అధికారులు సఖి కార్యక్రమంపై నిర్వహించిన అంశాలు, సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కిశోర బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి నివారణకు తగిన చర్యలు, బాల్య వివాహాలను నివారణకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సఖి కార్యక్రమంలో వివరించాలన్నారు. సమావేశంలో మండల ప్రత్యేకధికారిణి అరుణకుమారి, ఎంపీడీఓ గంటా వెంకటరావు, ఐసీడీఎస్ పీఓ ఉమాభారతి, రాకోడు పీహెచ్‌సీ వైద్యాధికారి జగదీష్, ఈఓపీఆర్డీ డి.తిరుపతినాయుడు, మండల స్థాయి అధికారులు, మహిళా పోలీస్, అంగన్‌వాడీ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ అశోక్‌కుమార్

అనుబంధాన్ని అర్థం చేసుకుంటున్నాం.: ఆర్‌డీఓ

భోగాపురం: విమానాశ్రయ నిర్వాసిత గ్రామాల్లో గత కొన్నేళ్లుగా నివాసముంటున్న ప్రజలు వారి గ్రామాలు విడిచి వేరే ప్రాంతం వెళ్లాలంటే చాలా బాధగా ఉంటుందని, అన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ఉంచుకునే మనస్సు ఉండబట్టే ఇంత కాలం ఎవరిని ఏమీ అనలేదని ఆర్‌డీఓ సూర్యకళ పేర్కొన్నారు. భోగాపురం మండలం నిర్వాసిత గ్రామమైన మరడపాలెం గ్రామస్తులతో మంగళవారం ఆమె మాట్లాడారు. ఏడాదిగా మిమ్మల్ని గ్రామాన్ని ఖాళీ చేయాలని చెప్పుకోస్తున్న ఏనాడు మిమ్మల్ని ఇబ్బందులకు గురి చేయలేదని అన్నారు. ఇప్పుడు తప్పనిసరిగా గ్రామాన్ని ఖాళీ చేయాలని నిర్వాసితులకు సూచించారు. ప్రధానంగా ఆర్ అండ్ ఆర్‌కాలనీల్లో నిర్వాసితులకు సకల సదుపాయాలతో పూర్తి వసతులు కల్పించామని, ఇప్పటికే బొల్లింకలపాలెం, ముడసర్లపేట, రెల్లిపేట తదితర గ్రామాల నిర్వాసితులు ఆయా ఆర్ అండ్ ఆర్ కాలనీలకు వెళ్లడం జరుగుతుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మరడపాలెం గ్రామం కూడా ఖాళీ చేయాలని, ముందుగా పాఠశాలలు, విద్యార్థులకు సంబంధించి పునరావాస కాలనీల్లో ఏర్పాటు చేసిన పాఠశాలల్లో విద్యాబోధన ప్రారంభమైందని అన్నారు. మీ అందరికీ కూడా ప్యాకేజీలతో పాటు మీకు రావలసిన బకాయిలు చెల్లించామని, ఇంకా ఏవరికైనా చెల్లించాల్సిన బకాయిలు ఉన్నాయని చెప్పిన వారికి తక్షణమే బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. వచ్చే శుక్రవారం నిర్వాసితులు విడతల వారీగా గృహాలను ఖాళీ చేయాలని సూచించారు. తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, సీఐ కేవీవీ విజయనాథ్, ఎస్ఐలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీపై శిక్షణ

భోగాపురం: చెత్త నుంచి సంపద తయారీపై జెడ్పీ సీఈఓ డా.అశోక్‌కుమార్ మండలంలోని నందిగాం గ్రామంలో శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సేకరించిన చెత్తను తడి పొడిగా వేరు చేసి, దానిని ఏ విధంగా ఎరువుగా తయారు చేయాలనే అంశాలపై అవగాహన కల్పించారు. చీపురుపల్లి, గుర్ల, భోగాపురం మండలాల ఇంజినీరింగ్ అసిస్టెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాల్లో సమాన అభివృద్ధి

- శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



అభివృద్ధి పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: రోజు రోజుకు విస్తరిస్తున్న నగరంలోని అన్ని ప్రాంతాల్లో సమ ప్రాతిపదికన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. నగరంలోని 1వ డివిజన్ లక్ష్మీగణపతి కాలనీలో రూ.5 లక్షలతో నిర్మించ తలపెట్టిన రోడ్డు, కాలువ నిర్మాణ పనులను ఆయనతో పాటు నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి కొబ్బరికాయ కొట్టి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయరు విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నగరంలోని అన్ని డివిజన్‌లలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నేతృత్వంలో చేపడుతున్నామన్నారు. శంకుస్థాపనలు చేయడమే కాకుండా అనతి కాలంలో పూర్తి చేసి వాటి ప్రారంభోత్సవాలను కూడా చేపడుతున్నామన్నారు. 5 లక్షల రూపాయలతో 1వ డివిజన్‌లో కాలువ, రహదారి నిర్మాణాలకు శ్రీకారం చుట్టడం సంతోషంగా ఉందన్నారు. లక్ష్మీ గణపతి కాలనీలో ప్రజల కోరిక మేరకు రహదారి కాలువ నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జి ముచ్చు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లి అమ్మవారితోనే గ్రామం సుభిక్షం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: ఉత్తరాంధ్ర ఇలవేల్పు పైడితల్లి అమ్మవారిని ఆరాధించడం ద్వారా గ్రామం సుభిక్షంగా ఉంటుందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని పోలిపల్లి గ్రామంలో వెలసిన పైడితల్లి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి సర్పంచ్ కర్రోతు వెంకటరమణ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలతో ఎమ్మెల్యే మంగళవారం సమావేశం నిర్వహించారు. ముందుగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 40 ఏళ్ల క్రితం నాటి ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో మళ్లీ కొత్తగా సుమారు రూ.40 లక్షల వ్యయంతో నిర్మించేందుకు దేవదాయశాఖ అధికారులు ముందుకు రావడంతో అభినందనీయమన్నారు. తన వంతు సాయంగా ఇప్పటికే వారికి రూ.10 లక్షలు అందజేయడం జరిగిందన్నారు. వచ్చే నెల మార్చి 6, 7, 8 తేదీలలో జరగబోయే అమ్మవారి పండుగకు ముందు గ్రామ పెద్దలు వేదపండితులను సంప్రదించి ఆలయ పునర్నిర్మాణానికి మంచి మూహుర్తం ఖరారు చేస్తే.. వచ్చే సంవత్సరం (2024) పండుగకు ముందే దేవదాయశాఖ అధికారులు ఆలయ పుర్నిర్మాణాన్ని పూర్తి చేస్తారని తెలిపారు. సమావేశంలో దేవదాయశాఖ ఈఓ ప్రసాద్, ఎండోమెంట్స్ ఏఈ తమ్మినేని చందన, సచివాలయ కన్వీనర్లు పతివాడ రామకృష్ణ, కర్రోతు శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు కర్రోతు పైడిరాజు, పోలిపల్లి సంతోష్, బుగత నారాయణమ్మ, పోతన్న, కర్రోతు గురమ్మ, చింతపల్లి శంకర్, కర్రోతు శంకర్రావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విదేశీ విద్యతో ఉన్నత చదువులు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు

నెల్లిమర్ల రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న విదేశీ విద్యా దీవెన పథకంతో పేద విద్యార్థులు సైతం విదేశాల్లో ఉన్నత చదువులు చదువుకోవడానికి అవకాశం కలిగిందని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు చెప్పారు. మండలంలోని మొయిద విజయరామపురంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రజలకు అన్ని విధాల మంచి చేయడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏకైక లక్ష్యమని అన్నారు. ఇటీవల విడుదల చేసిన విదేశీ విద్యా దీవెన పథకాన్ని పార్టీలకు అతీతంగా వర్తింపజేసి మరోసారి తన గొప్ప మనసును చాటుకున్నారని చెప్పారు. జిల్లాకు చెందిన వంగర మండలం, సంగాం గ్రామానికి చెందిన టీడీపీ నేత, మాజీ సర్పంచ్ బొద్రోతు శ్రీనివాసరావు కుమార్తె శైలజకు లబ్ధి చేకూరడమే ఇందుకు నిదర్శనమన్నారు. తొలి విడతగా రూ.13.99 లక్షలు మంజూరయ్యాయని, రెండేళ్లలో రూ. 84 లక్షల ఆర్థిక సాయం అందించడం సామాన్య విషయం కాదన్నారు.

లోకేష్, పవన్‌కు ప్రజాదరణ లేదు..

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పగటి వేషగాళ్లు ఊర్లపై పడ్డారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్సీ పెనుమత్స సూచించారు. గత ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయిన చంద్రబాబు పుత్రుడు లోకేష్, రెండు చోట్లా ఓటమి చెందిన దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ యాత్రల పేరిట బయటకి రావడం హాస్యాస్పదమన్నారు. ప్రజాదరణ లేని నాయకులు ఎంత మంది వచ్చినా తమకి వచ్చిన నష్టమేమి లేదన్నారు. సంక్షేమ విప్లవాన్ని తీసుకువచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల ఆశీస్సులు, దేవుడి దీవెనలు ఎల్లప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు.

అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

- సీతం ఇంజినీరింగ్ కళాశాలలో కేంద్ర బడ్జెట్‌పై సమీక్ష



మాట్లాడుతున్న ఆర్థిక నిపుణులు లంక దినకర్

విజయనగరం అర్బన్: ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారతదేశం మరో 25 ఏళ్లలో అవతరించబోతుందని హైదరాబాద్‌కి చెందిన ఆర్థిక నిపుణులు లంక దినకర్ అన్నారు. గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 'కేంద్ర బడ్జెట్'పై మంగళవారం జరిగిన చర్చా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే ప్రస్తుతం ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అని, రాబోయే 25 ఏళ్లలో అతిపెద్దదిగా అవతరిస్తుందని అన్నారు. బడ్జెట్‌లో విద్య, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమలకు పెద్ద పీట వేశారని అన్నారు. కళాశాల మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆడిటర్ బాలాజీ, కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, బాలాజీ పాలిటెక్నిక్ కాలేజీ డైరెక్టర్ రెడ్డి పావని, కుసుమంచి సుబ్బారావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీరామమూర్తి, మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.వరూధిని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగ్గురు పాత నేరస్తుల అరెస్టు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న టూటౌన్ సీఐ సిహెచ్.లక్ష్మణరావు (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలో చోరీ కేసుకు సంబంధించి టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, సీసీ పుటేజీల ఆధారంగా ముగ్గురు పాత నేరస్తులను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు టూటౌన్ సీఐ సిహెచ్.లక్ష్మణరావు మంగళవారం అందించిన వివరాలిలా ఉన్నాయి. రాజీవ్‌నగర్ కాలనీ స్వర్గధామం ఎదురుగా ఉన్న పాన్‌షాపులో గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగుల గొట్టి పాన్‌షాపులో ఉన్నటువంటి సామగ్రి, నగదు పట్టుకుపోయినట్లు బాధితుడు టూటౌన్ పోలీసులకు ఈ నెల 3న ఫిర్యాదు చేశాడు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు పలు ఆధారాలను సేకరించి పాత నేరస్తులుగా గుర్తించారు. రాజ్యలక్ష్మి థియేటర్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన నారుకుర్తి సాయికృష్ణ, బొండుల గూడెంకి చెందిన గండి భాస్కర నాగశర్మ, లింగధారిపేటకి చెందిన టేకు నవీన్‌కుమార్ సింగ్‌లను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.600 నగదు, 17 సిగిరెట్ బాక్స్‌లను సీజ్ చేసి రిమాండ్‌కి తరలించామని సీఐ తెలిపారు.